# కాలం కరిచిన నాడు

డోర్ బెల్ విని తలుపు తీసిన శ్వేతకి గుమ్మం బయట మౌనంగా తలొంచుకుని నిలబడ్డ మాధవన్‌ని చూడగానే ఎందుకో కంగారు పుట్టుకొచ్చింది. అతను నిలబడ్డ తీరుచూస్తే మనసెందుకో కీడుని తలపెట్టింది. దానికి తోడు మ్యావ్ మ్యావ్ అంటూ పిల్లికాళ్ళ సందులోంచి పరిగెత్తి భయాన్ని రెట్టింపు చెయ్యడంతో గుండె దడ దడలాడి మరీ నీరసం కమ్ముకొచ్చింది.

మాధవన్ భర్త తోటి ఉద్యోగస్తుడు. భర్త ఆఫీసుకెళ్ళి రెండు గంటలు దాటింది. ఈ వేళప్పుడు అతను రావడం, అందులో ఏదో చెప్పలేని విషయమన్నట్లు దిగాలుగా తలొంచుకు నిలబడటంతో ఆమె ఆలోచనలు చెడువైపుకే పరుగు లెట్టసాగాయి.

ధైర్యం కూడ గట్టుకుని - "ఏం మాధవన్ గారూ! ఈ వేళప్పుడు వచ్చారు?" అని అదురుతున్న గుండెని చేత్తోపట్టుకుని అడిగింది.

"రాజు ఆఫీసుకి వస్తోంటే ట్రక్కు గుద్దేసిందమ్మా! పోలీసులు పర్సులోని విజిటింగ్ కార్డుమీదున్న నెంబరుకి ఫోన్ చేసారు. మేనేజర్‌గారు, మేము ఆసుపత్రికెళ్ళేసరికే ప్రాణం పోయింది. మీకు కబురు చెప్పి తీసుకురమ్మని మేనేజర్ గారు కారు పంపేరమ్మా!" అన్న మాటలు పూర్తికాకుండానే శ్వేత స్పృహ తప్పి పడిపోయింది.

లోపలున్న సూరమ్మగారు బైటికొచ్చి విషయం విని గోలపెడ్తూ గుండెలు బాదుకోసాగింది. ఆ ఏడుపు విని ఇరుగు పొరుగులు పరిగెత్తుకొచ్చారు. శ్వేత ముఖంమీద నీళ్ళుజల్లి, తెలివి వచ్చాకా కారు ఎక్కించి ఆసుపత్రికి పంపేరు.

నవ్వుతూ టాటా చెప్పి ఆఫీసుకెళ్ళిన రాజు ఇక శాశ్వతంగా వీడ్కోలు చెప్పేసి వెళ్ళిపోయాడన్న భయంకరమైన నిజాన్ని నమ్మలేక పోతోంది శ్వేత. 'ఇంకా బ్రతికున్నాడేమో! వీళ్ళు పొరపడి వుంటారు' అన్న ఆశ మనసులో ఓ మూల మెదలసాగింది. "అదే నిజమైతే ఎంత బాగుండును" అనుకుంది కూడా.

ఇస్త్రీ బట్టలేసుకుని ఆఫీసుకెళ్ళిన రాజు, బట్టలే కాద్సుమ్మ అసలు శరీరమే గుర్తు తెలియనంతగా నలిగి పోయింది. ఆస్థితిలో శవాన్ని చూసిన ప్రతి ఒక్కరి హృదయం కరిగిపోయింది. అలాంటిది తల్లి, భార్యల పరిస్థితి వర్ణించడం ఎవరితరం? కన్న కడుపు ఒకలా శోకిస్తే, కట్టుకున్న భార్య హృదయం మరోలా శోకిస్తోంది. వచ్చిన వారంతా వారిని ఊరడించబోయి విఫలురవుతున్నారు.

కనిపెంచిన తల్లికి, ప్రేమించి పెళ్ళి చేసుకున్న భార్యకి దూరంచేసి రాజుని తనతో తీసుకెళ్ళి పోయింది విధి. 'మీ కష్ట సుఖాలతో నాకేం పని' అంటూ కాలం తనగమనాన్ని సాగించింది. వాటికి తలొంచిన బంధు మిత్రులు, తల్లి, భార్య రాజుని భూదేవి ఒడిలోకి శాశ్వతంగా పంపేసారు. వారికి మిగిలింది రాజు మిగిల్చి వెళ్లిన తీపి గురుతులు మాత్రమే.

ఏడాది క్రితమే వివాహమైన శ్వేత, నూరేళ్ళపాటు తన జీవితం రాజుతో ముడిపడి ఉంటుందని స్వర్గానికి నిచ్చెనలు కట్టుకుంటున్న తరుణంలో కనీసం నేలమీదన్నా నిలవనివ్వకుండా అగాధంలోకి తోసేసింది విధి. ముందు జీవితాన్ని తల్చుకుని "నా భవిష్యత్ ఏమిటి? ముందు జీవితం ఎలా గడపాలి? రాజులేని నేను ఎలా ఒంటరిగా బ్రతగ్గలను?" అన్న బెంగ, బాధతో కుళ్ళి కుళ్ళి ఏడ్చేది శ్వేత.

రావిచెట్టు నీడని విశ్రమిస్తుండగా ఎవరో వచ్చి గొడ్డలితో ఆ చెట్టుని నరికి పారేసి తన్ని మండు టెండలోకి తోసేసినట్లుంది సూరమ్మగారి పరిస్థితి. "నీ చేతిలోనే చివరి గడియలు ముగుస్తాయనుకున్న నా కళ్ళెదుటే వెళ్ళిపోయావా బాబూ! నా తలకి కొరివిపెడతావనుకున్న నాకు నీ తల కొరివి చూసే దురదృష్టం పట్టిందా తండ్రీ!" అంటూ తల్లిపేగు తెగేలా శోకాలెడుతున్న ఆ మాతృ మూర్తిని చూసిన ప్రతి ఒక్కరి హృదయం దుఃఖంతో బరువెక్కసాగింది.

పరిగెడుతున్న కాలం రాజు జ్ఞాపకాలని నెమ్మదిగా తన వెంట నడిపించుకెళ్ళసాగింది. బంధు మిత్రులు ఎవరి పనుల్లో వారు నిమగ్నమయి రాజు కుటుంబం గురించి అంతగా పట్టించుకోడం తగ్గించారు. ఆత్మీయులు మాత్రం తరచు వచ్చి తోచిన సలహాలిచ్చి వెళ్తున్నారు.

సర్వీసులో వుండగా రాజు పోవడం వల్ల ప్రభుత్వం శ్వేతకి అదే ఆఫీసులో ఉద్యోగం యిచ్చింది.

ఉద్యోగంలో చేరిన శ్వేత ఒకదినచర్యకి అలవాటుపడి దృష్టిని పనివైపుకి మళ్ళించి కొద్ది కొద్దిగా తేరుకోసాగింది. కానీ ఇటు ఇంట్లో ఒంటరిగా వున్న సూరమ్మగారి అవస్థ వర్ణనాతీతం.

ముప్పయ్ ఏళ్ళు నిండకుండా భర్తకి దూరమయిందామె. అమెరికా పై చదువుకని వెళ్ళిన భర్త తిరిగి సుందరమ్మగారి దగ్గరకి రాలేదు. ఏడాది తరవాత అతని వద్దనుండి వచ్చిన ఉత్తరంలో తనతో కాపురం చెయ్యలేనని, అమెరికాలాంటి దేశాల్లో బ్రతకాలంటే చదువుకున్న భార్య కావాలని రాస్తూ, విడాకుల కాగితంతో పాటు యాభైవేల చెక్కు కూడా పంపి ఆమెని

వదులుచ్చుకున్నాడు. అత్తవారి ఆదరణ అంతంత మాత్రమే అయిన సూరమ్మగారింక అక్కడ వుండలేక ఏడాది రాజుతో పుట్టింటికి చేరింది. పాతకాలపు చాదస్తపు భావాలుగల సూరమ్మగారి తల్లిదండ్రులు ఆమె భవిష్యత్ గురించి ఏమాత్రం ఆలోచించలేదు. భర్త పంపిన డబ్బు మీదొచ్చే వడ్డీలతో పుట్టింట వుండి కాలం గడపసాగింది. తల్లిదండ్రులు గతించారు. ఒంటరిదైన సూరమ్మ గారు కొడుక్కి పెద్ద చదువు చెప్పించి, పెద్ద ఉద్యోగస్తుడిని చెయ్యాలన్నదే ధ్యేయంగా పెట్టుకుని రాజుని పెంచసాగింది.

పై వూళ్ళో వుండిచదువుకునే కొడుక్కి నెల నెలా పంపడానికి వచ్చే వడ్డీలు సరిపోక అసలు తీసి పంపవలసి వచ్చేది. రాజు చదువు పూర్తయి, ఉద్యోగంలో చేరే నాటికి ఆవిడ బాంక్ బాలన్సు సున్నా అయ్యింది. కానీ కొడుకు ఇంజినీరయ్యాడన్న ఆనందంలో డబ్బు ఖర్చయి పోయిందని బాధపడలేదామె. కొడుకు పంచన శేష జీవితం నిశ్చింతగా గడిచిపోతుందన్న ధైర్యంతో, నమ్మకంతో కొడుకుని చూసి మురిసిపోయేది.

రాజు తోటి ఉద్యోగస్తుడి చెల్లెల్ని వివాహం చేసుకుంటానని చెప్పినపుడు సూరమ్మగారు మొదట్లో వద్దన్నా, కొడుకు పట్టినపట్టు వదలక పోయేసరికి ఈవిడే,సడలి వివాహానికి ఒప్పుకున్నారు.

సూరమ్మగారు శ్వేతని మొదట్లో అభిమానంగానే చూసుకునేవారు. శ్వేత కూడా ఎంతో అణుకువగా అత్తగారితో కలిసి పని పాటలు చేసేది. రాజూ, శ్వేతలు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఆఫీసు నుంచి వస్తూ పువ్వులూ, స్వీట్లూ తేవడం, రాగానే రోజూ సినిమాకో షికారుకో తీసుకు వెళ్ళడం, రాత్రి తొమ్మిది కాకుండా శ్వేతతో తన గదిలోకెళ్ళి తలుపులు మూసుకోడం సూరమ్మగారిలో మార్పుని తీసుకురాసాగింది. దానికి మొదటి కారణం తను పోగొట్టుకున్న సుఖాన్ని శ్వేత తన ఎదురుగా అనుభవించడమ్మ్మ రెండు ఇన్నేళ్ళపాటు "నాదే!" అనుకున్న కొడుకు ప్రేమని మరో వ్యక్తి వచ్చి పంచుకోడం అది అసూయగా మారి లోపల్లోపల దహించి వెయ్య సాగింది.

కొడుకుని చూస్తే ఎంత ప్రేమ పుట్టుకొచ్చేదో కోడల్ని చూస్తే అంత ద్వేషం కలిగేది. కొన్నాళ్ళు ఆ ద్వేషాన్ని మనసులోనే అణచి పెట్టుకుంది. రాను రాను దాచుకోలేక కొడుకు లేని సమయంలో శ్వేతని సూటీపోటీ మాటలతో దెప్పడం ప్రారంభించింది. ఆమె పెద్దరికానికి గౌరవం యిచ్చి వూరుకుంటున్న శ్వేతని మరీ లోకువ కట్టి రోజు రోజుకి సాధించడం ఎక్కువయిందేగానీ తగ్గలేదు. అసలు బాధని పైకి కక్కలేక ఏదో వంకపెట్టి ఇంతని అంత చేసి

గొడవ చేస్తున్న అత్తగారి మాటలు భరించలేక మానసిక వేదనకి గురవసాగింది. కొంతకాలానికి అత్తగారి మనసులోని బాధని అర్థం చేసుకున్న శ్వేత అత్తగారి ఎదురుగా భర్తతో చనువుగా వుండడం, సినిమాలు, షికార్లు తగ్గించడానికి ప్రయత్నించింది. కారణం తెలియని రాజు ఆమెరానన్నా వినక బలవంతాన్న ఆమెని బైటికి తీసుకెళ్ళేవాడు. అటు భర్త ఆనందాన్ని పాడు చెయ్యలేక, ఇటు గునపపు పోటుల్లాంటి అత్తగారి మాటల్ని భరించలేక నలిగి పోయేది శ్వేత. భర్త ఆఫీసుకెళ్ళి తిరిగి వచ్చే మధ్యకాలంలో సూరమ్మగారు శ్వేతని రాసి రంపాన పెట్టసాగింది. కొడుకుని కొంగుకి కట్టేసుకుని, తనకి దూరం చేసావని, ఉన్నదంతా ఊడ్చి వాడిని చదివించి పెంచింది నీ కప్పగించడానికేనా తల్లీ! లాంటి మాటల పోట్లతో హింసించసాగింది. సహజంగా నెమ్మదస్తురాలైన శ్వేత అత్తగారికి ఎదురు చెప్పలేక, ఆమె గురించి భర్తకి నేరమూ చెప్పలేక ఇద్దరి మధ్యా నలిగిపోసాగింది. భర్తలేని టైములో శ్వేతకి ఆ ఇంటవుండటం నిప్పుల మీద నడకే అయింది.

ఎలాగైనా శ్వేతని రాజుకి దూరం చెయ్యాలన్న పట్టుదల రోజురోజుకీ సూరమ్మగారిలో పెరగసాగింది. దానికి మార్గాన్ని అన్వేషించసాగింది.

అటువంటి తరుణంలోనే ఏ చెడు శక్తో ఆమె కోరికని మన్నించినట్లు రాజునే ఈ లోకంలోంచి తీసుకెళ్ళిపోయి శ్వేతకే కాకుండా తనకీ కొడుకుని దూరం చేసేసింది.

తొలి రోజు శ్వేత ఆఫీసుకి వెళ్ళేకా ఏకాకిలా కూర్చున్న సూరమ్మగారిలో కోటానుకోట్ల ఆలోచనలు. "కొడుకే సర్వస్వం అనుకుని జీవితమంతా అతడిని ప్రయోజకుడిని చెయ్యడానికే పాటుపడి, 'కొడుకు ఉద్యోగస్తుడు కాగానే' ఇంక నాకేం లోటు"? అని గర్వ పడ్డ తన్ని దేముడు దిక్కులేది దాన్ని చేసేశాడేమిటి? ఇప్పుడు కొడుకేకాదు, నాదీ అన్న ఒక్కపైస కూడా తనకి లేదు. శ్వేతకి కట్టుకున్న భార్యగా ఉద్యోగం యిచ్చారు. నాకేం వుంది?? దురభిమానంతో కొడుకు బ్రతికున్నన్నాళ్ళూ కోడల్ని నానామాటలూ ఆడి హింసించాను. ఇప్పుడు మా యిద్దరి మధ్యా వుండే కొడుకు అనే లింకు తెగిపోయింది. ఇప్పుడు ఎక్కడికెళ్ళాలి? ఇటుపుట్టినింటివారా ఎవ్వరూలేరు. అటు అత్త వారింటితో ఏనాడో బంధం తెగిపోయింది. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని నానా మాటలూ ఆడిన కోడలింట వుండగలను. ఇంతకీ శ్వేత మనసులో ఏమనుకుంటోందో! అయినా నన్నెందుకు పోషించాలి? ఎందుకు పోషిస్తుంది?? ఒక్కరోజన్నా ఆదరించి ఆప్యాయంగా మాట్లాడిందా? ఈ నాటిదాకా తను పెట్టిన బాధల్ని

గుర్తుచేసుకుని కసితీర్చుకోకుండా వుంటుందా? అందుకే పెద్ద వాళ్ళన్నారు స్వర్గం, నరకం అన్నవి ఇక్కడే వున్నాయని చేసుకున్న పాపాలు ఇక్కడే అనుభవిస్తామని. తను చేసిన పాపానికి ఇది ఫలితం కాక మరేమిటి??' ఇలా పరి పరి విధాలుగా పోయే ఆలోచనల్ని అరికట్టలేక మనోవ్యధతో కొడుకు పోయిన దగ్గర నుంచి నోరువిప్పి శ్వేతతో మాట్లాడలేక పోయేవారు. ఆఫీసు నుంచి వచ్చే శ్వేతకి ఎదురు పడటానికి ధైర్యం చాలేదికాదు. దొంగతనం చేసిన వ్యక్తిలా తప్పించుకు తప్పించుకు తిరిగేవారు. విస్తరి ముందుకూర్చున్న ఆమెకి ముద్ద గొంతు దిగేదికాదు. ఇలా ఆమె చేసిన తప్పులు ఆమెనే లోపల బాధిస్తూ కుంచింపజేస్తున్నాయి. రానురాను ఆ ఇంట్లో వుండడం ఆమెకి కష్టమయిపోసాగింది. ఏం చెయ్యాలి? ఎక్కడి కెళ్ళాలి?? అని బుర్ర వేడెక్కేలా ఆలోచించసాగింది.

ఎవరో చెప్పగా వింది - వృద్ధుల కోసం గృహాలున్నాయని. అందునా దిక్కులేని వృద్ధుల్ని ఉచితంగా వుంచుకునే గృహాలుకూడా వున్నాయని. అడ్రస్ అడిగి తెప్పించుకుంది. అక్కడికి చేరడానికి సరిపడ్డ డబ్బు కోడలి బీరువాలోంచి తీసుకుని తన బట్టల సంచీతో బయలుదేరింది.

తలుపు తాళంవేసి వెనక్కి తిరిగిసంచీ అందుకొంటున్న సూరమ్మగారికి, తలపోటుగా వుందని అర్ధరోజు శలవు పెట్టి ఇంటికొచ్చిన శ్వేత ఎదురుగా కనపడేసరికి దొరికిపోయిన దొంగలా తత్తరపడి వణికిపోసాగింది. చింతనిప్పుల్లా వున్న ఆమెకళ్ళు, కందగడ్డలా వున్న ముఖాన్ని సూటిగా చూడలేక తలదించుకున్నారు. "ఎక్కడికీ ప్రయాణం"? అన్న శ్వేత ప్రశ్నకి జవాబేం చెప్పాలో తెలీక ముఖాన్ని చేతుల్తో కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగారు.

రెండు భుజాలు పట్టుకుని లేవనెత్తిన శ్వేతని హత్తుకుపోయి పశ్చాత్తాపాగ్నిలో దహించుకుపోతున్న అత్తగార్ని చూసి "అత్తయ్యగారూ! కొడుకుని పోగొట్టుకున్న నాటినుంచి మీకు నేను కూతుర్ని. చిన్నతనంలోనే అమ్మని పోగొట్టుకున్న నాకు మీరు తల్లిలాగే కనపడేవారు. ఇక ముందు ఈ అనుబంధంతో అనురాగాన్ని పెంచుకుని ఆ ఆప్యాయతతోనే కలిసి బ్రతుకుదాం. గడచింది పీడకలగా మరిచిపోండి" అని అంటున్న శ్వేతని అక్కున చేర్చుకున్న సూరమ్మగారు 'అత్తగార్ని' అనే అహాన్ని గుమ్మం బైటే విడిచి తల్లి రూపం ధరించి లోపలికి అడుగుపెట్టారు. ✻

**(1-15 ఏప్రిల్ 1995 గీతాంజలి)**